క్లుప్తంగా

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.పద్మ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస్ మాట్లాడారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కార్యదర్శి సుల్తానా, అధ్యక్షురాలు రామలక్ష్మి, సహాయ కార్యదర్శి వెంకటనర్సమ్మ, శివకుమారి, రాణి, అరుణ, నిరోష, అనసూర్య, లక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

పెండింగ్‌లో ఉన్న రూ.8,600 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, డైట్ బిల్లులు విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (డీఎస్‌ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మొదట కేఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కన్వీనర్ డాక్టర్ వివేక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,600 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలన్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బి.వీరభద్రం, కేలోత్ సాయికుమార్, మాళోత్ శాంతకుమార్, గుగులోత్ సూర్యప్రకాష్, భూక్యా శ్రీకాంత్, సీహెచ్ రామ్‌చరణ్, గుగులోత్ శివవర్మ, దేవేందర్, వీరేశ్, దినేశ్, దిలీప్, జవహర్, రమేశ్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలి..

ఇల్లెందు: జీసీసీ హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని టీయూసీఐ డిమాండ్ చేసింది. సోమవారం ఇల్లెందు హమాలీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం గోదాం ఇన్‌చార్జ్ వీరేశంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం టీయూసీఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు మాట్లాడారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సదుపాయం కల్పించాలని కోరారు. కార్మిక సమస్యలపై ఈ నెల 31న జిల్లా కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలో అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు గురునాథం, రవి, సంపత్, శ్యామ్, బాజ్యా శ్రీను, రాజశేఖర్, రామచంద్రు, ఉపేందర్, సాయి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని లేగదూడకు గాయం

ఇల్లెందురూరల్: పశువుల పోషకులు వాటిని రాత్రి వేళ ఇంటి వద్ద కట్టేయకుండా వదిలేయడంతో అవికాస్త ప్రధాన రహదారులు, బస్టాండ్‌లపై నిద్రిస్తున్నాయి. ఇటీవల చెరువుకట్ట ప్రాంతంలో గేదెను బోర్‌వెల్ వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో లేగదూడ కాలుకు తీవ్ర గాయమైంది. రోడ్డు పక్కనే పడిపోయిన దూడ కాలు నుంచి భారీగా రక్తస్రావం జరగడాన్ని గమనించిన స్థానికులు కాలుకు కట్టు కట్టి సత్యనారాయణపురం పశువైద్యశాలకు తరలించారు.

సీపీఐ జిల్లా కమిటీలో ఇల్లెందు నాయకులు

ఇల్లెందు: సీపీఐ జిల్లా మహాసభ ఇటీవల అశ్వారావుపేటలో జరగగా.. పార్టీ జిల్లా కమిటీలోకి ఇల్లెందు నాయకులను ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కె.సారయ్య, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, పార్టీ జిల్లా కంట్రోల్ కమిషన్ సభ్యులుగా ఉన్న మిర్యాల రంగయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపికయ్యారు. జిల్లా కౌన్సిల్‌లోకి బాస శ్రీనివాసరావు, నజీర్ అహ్మద్, బి.సత్యనారాయణ, న్యాయవాది ఎస్.సత్యనారాయణ, కమటం చంద్రకళ, హరీశ్‌గౌడ్ ఎన్నికయ్యారు.

నేడు బాక్స్‌ల పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): తేనెటీగల పెంపకంపై శిక్షణ పొందిన మహిళలకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం సీఎండీ బలరాం బాక్స్‌లు పంపిణీ చేయనున్నారని సోమవారం ఏరియా జీఎం శాలేంరాజు తెలిపారు. సింగరేణి సీఎస్సార్ పాలసీలో భాగంగా ఏరియా ప్రభావిత ప్రాంతాల్లోని మహిళలకు మూడు రోజుల పాటు తేనెటీగల పెంపకంపై బృందాలవారీగా శిక్షణ ఇచ్చారని, వారికి బాక్సులను అందజేయనున్నామని పేర్కొన్నారు.

ఆటలు ఆడుకునేదెలా?

- పిచ్చిమొక్కలతో అధ్వానంగా క్రీడా ప్రాంగణం
- నిర్వహణ లేక నిరుపయోగం



రూపం కోల్పోయిన రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ క్రీడా ప్రాంగణం

ఇల్లెందురూరల్: క్రీడలను ప్రోత్సహించి ప్రతిభ ఉన్న యువతకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఎకరం స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసి ఖో–ఖో కబడ్డీ, వాలీబల్, లాంగ్‌జంప్ కోర్టుల ఏర్పాటుతో పాటు యువత వ్యాయామం చేసుకునేలా పరికరాలను ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. దీనికోసం ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో ప్రాంగణానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసింది. ఇలా మండలంలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అన్ని ఆవాసాలకు ఒకే చోట క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణను పంచాయతీ అధికారులు విస్మరించడంతో ప్రాంగణం కాస్త పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. ఖో–ఖో, వాలీబాల్ ఆడటానికి అమర్చిన పైపులు మాయమయ్యాయి. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, లాంగ్‌జంప్ కోర్టులు ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. యువత వ్యాయామం చేసుకునేందుకు ప్రాంగణంలో అమర్చిన పైపులు పిచ్చిమొక్కలతో అల్లుకుపోయాయి. ఫలితంగా భారీ వ్యయంతో ఏర్పాటు చేసిన రాఘబోయినగూడెం క్రీడా ప్రాంగణంలో ప్రస్తుతం బోర్డు మాత్రమే కనిపిస్తోంది. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ఆటలు ఆడుకునేలా తీర్చిదిద్దాలని యువత వేడుకుంటోంది.


పైపులను అల్లుకుపోతున్న పిచ్చిమొక్కలు

ముమ్మరంగా వాహన తనిఖీలు


కొత్తగూడెంటౌన్: బస్టాండ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న సీఐ కరుణాకర్


ఇల్లెందు: పట్టణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్/పాల్వంచరూరల్: అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు పలు ప్రాంతాల్లో సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం వన్‌టౌన్ పరిధిలోని దుకాణాలు, హోటళ్లలో తనిఖీ చేశారు. మావోయిస్టుల వారోత్సవాలు మొదలు కావడంతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాకేశ్, విజయ పాల్గొన్నారు. కాగా, టూటౌన్ ఏరియా పరిధిలోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు, రామవరం, రుద్రంపూర్, గౌతంపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో సీఐ ప్రతాప్ ఆధ్వర్యంలోని వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే, పాల్వంచ మండలంలోని సోములగూడెం క్రాస్ రోడ్డు బీసీఎం జాతీయ రహదారిపై సీఐ సతీశ్, ఎస్ఐ సురేశ్, స్పెషల్ పార్టీ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

ఇల్లెందులో..

ఇల్లెందు/ఇల్లెందురూరల్/టేకులపల్లి: పట్టణంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సోమవారం డీఎస్పీ చంద్రభాను, సీఐ టి.సురేశ్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐలు హసీనా, శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, మండలంలోని కొమరారం, పోలారం ప్రధాన రహదారులపై కొమరారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ నాగుల్‌మీరా పాల్గొన్నారు. టేకులపల్లి లోనూ తనిఖీలు చేశారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి


నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న సీఈఓ నాగలక్ష్మి

పాల్వంచరూరల్: అసెంబ్లీ ఓటర్ల జాబితా నుంచి వార్డులవారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని బస్వతారక కాలనీ, కేశవాపురం గ్రామ పంచాయతీలను సోమవారం ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డితో కలిసి సీఈఓ సందర్శించారు. ఓటర్ల జాబితాను పరిశీలించి, నర్సరీలోని మొక్కలు, కమ్యూనిటీ సోక్ పిట్‌లను తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించాలని, వారం రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ పోరండ్ల రంగా, కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మార్కింగ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సెవెన్‌హిల్స్ ఏరియా నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి వరకు ఉన్న రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సోమవారం కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ పెట్టారు. డీఎంఎఫ్ నిధులు రూ.2 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టగా.. పూర్తి పూర్తి కాలేదు. ఒక పక్క ఆ పనులు జరుగుతూ ఉండగా, మరో పక్క సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేసేందుకు గాను మార్కింగ్ చేశారు. రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటవుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


సెంట్రల్ లైటింగ్‌కు మార్క్ చేస్తున్న సిబ్బంది

శాశ్వత పరిష్కారం చూపాలి


చెరువు కట్టను పరిశీలిస్తున్న నాయకులు

సుజాతనగర్: సింగభూపాలెం చెరువు కట్టకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో కుంగిన చెరువు కట్టను సోమవారం పరిశీలించారు. మూడేళ్లుగా చెరువు కట్ట కుంగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని చెబుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని, వేసవిలో ప్రొటెక్షన్ వాల్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లిక్కి బాలరాజు, కున్సోత్ ధర్మా, వీర్ల రమేశ్, కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, బచ్చలకూర శ్రీనివాస్, శివరామకృష్ణ, చింతల శ్రీను, నల్లగొప్పు పుల్లయ్య, బాలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యోగా విజేతలకు సన్మానం

జూలూరుపాడు: జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రథమ, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన బసవయ్య, బోసు, నరేశ్‌ను సోమవారం ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆదివారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు జరిగాయి. వయస్సుల వారీగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన రాయి బసవయ్య మొదటి స్థానంలో నిలిచాడు. వెంగన్నపాలెంనకు చెందిన వేల్పుల బోసు మూడో స్థానం, పెండ్యాల నరేశ్ నాలుగో స్థానంలో నిలిచారు. విజేతలకు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్వరలింగం, సెక్రటరీ బుట్టి ప్రమీల బహుమతులు అందజేశారు.


యోగా విజేతలను సన్మానిస్తున్న దృశ్యం

వైద్యశాలకు రోగుల తాకిడి..

- సీజనల్ వ్యాధులతో వస్తున్న ప్రజలు
- పారిశుద్ధ్య లోపంతోనే వ్యాధులు ప్రబలుతున్నాయని ఆరోపణలు


పరీక్షల కౌంటర్ వద్ద బారులుదీరిన ప్రజలు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు రోగులు క్యూ కట్టారు. ఏ గది చూసినా రోగులతో కిక్కిరిసిపోతోంది. పల్లెలు, పట్టణాల్లో శానిటేషన్, క్లోరినేషన్, బ్లీచింగ్, ఫాగింగ్, ఫ్రైడే డ్రైడే.. లాంటి కార్యక్రమాలు జరగడం లేదు. దీంతో రోగాలు పెరిగాయి. దీంతో ఇల్లెందు ఏరియా వైద్యశాలకు రోగులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. పేరు నమోదు కౌంటర్ నుంచి వైద్యుల గది, మందులు, ఇంజక్షన్లు, పరీక్షల కౌంటర్లతోపాటు ఎక్స్‌రే యూనిట్ వద్ద జనం క్యూకట్టారు. కొందరు ఆస్పత్రిలోనే అడ్మిట్ అయ్యారు. జ్వరాలు, జలుబు, తల, ఒల్లు నొప్పుల లాంటి వాటితో ఎక్కువ మంది వచ్చారు. అయితే, గ్రామాల్లో గతంతో పోలిస్తే శానిటేషన్, క్లోరినేషన్, బ్లీచింగ్, ఫాగింగ్, ఫ్రైడే డ్రైడే.. లాంటి కార్యక్రమాలు ప్రస్తుతం సాగటం లేదు. అవగాహన కల్పించాల్సిన అధికారుల్లో చలనం లేదు. మండల, పట్టణస్థాయి అధికారులు జిల్లా కేంద్రాల్లో నివాసం ఉండటం వల్ల తమ కేంద్రాలకు వచ్చి, ఒకటి, రెండు సమావేశాలు నిర్వహించి, మధ్యాహ్నం 3 గంటలకే తిరుగు పయనం అవుతున్నారు. ఇక పల్లెలో పరిశుభ్రత కోసం ఎలాంటి కార్యాచరణ ఉండటం లేదు. ఇక ప్రజా ప్రతినిధులు లేకపోవటంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు గ్రామస్థాయిలో పాలన సాగుతోంది. వెరసి గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆస్పత్రిలో సరిపడా మందులు అందుబాటులో ఉండటం లేదు. వారం రోజులుగా ఇల్లెందు ఏరియా వైద్యశాలలో 700కు పైగా ఓపీ పెరిగిందని సూపరింటెండెంట్ హర్షవర్ధన్ తెలిపారు.

గ్రంథాలయాలతో ఎంతో ఉపయోగం


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీరాంమూర్తి

పాల్వంచ: విద్యార్థుల్లో అక్షరాస్యత, గణిత సామర్థ్యాల సాధనలో గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడుతాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎ.శ్రీరాంమూర్తి అన్నారు. సోమవారం పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్‌ల హెచ్‌ఎంలు ప్రకాష్‌రావు, మంగమ్మ, బీపీఎల్ కుమారి, రిసోర్స్ పర్సన్‌లు మంజుశ్రీ, రఘురాం, సత్యశ్రీ, కవిత, రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై విచారణ

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో డబుల్ బెడ్‌రూం స్థల వివాదంపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్ విచారణ నిర్వహించారు. కొంతకాలం కిందట డబుల్ బెడ్‌రూం స్థలం విషయంలో కొనసాగుతున్న వివాదంపై లబ్ధిదారులు న్యాయం చేయాలని కోరుతూ ఉన్నతాధికారులను ఆశ్రయించారు. దీంతో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు లబ్ధిదారులు, స్థల వివాదంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాలు చెప్పిన విషయాలను నమోదు చేసుకున్నారు. వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

సుజాతనగర్: తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత అంజనాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, బెల్టులు, టైలు, ఐడీ కార్డులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు సురేశ్ కుమార్, కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, ధర్మారావు, మైనేని నాగేశ్వరరావు, బోయపాటి నాగేశ్వరరావు, పాండురంగారావు, సీతారామశాస్త్రి, కామేశ్వరరావు, విజయమోహన్, జోసెఫ్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇల్లెందురూరల్: ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ సీపీఎం నేతలు సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. జేకే సింగరేణి క్వార్టర్ల నుంచి వెలువడే మురుగునీరు సుందరయ్యనగర్‌లో అరకిలోమీటరు దూరం ప్రయాణిస్తుందని, ఆ ప్రాంతంలో డ్రెయినేజీ లేకపోవడంతో దోమలకు ఆవాసంగా మారిందని చెప్పారు. కార్యక్రమంలో మోహన్‌రావు, కొడెం బోస్, అబ్బాస్, వజ్జ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పూర్తి చేయండి..

టేకులపల్లి: దారపాడు కాలనీ నుంచి కిష్టారం రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో ఈసం నర్సింహారావు, కడుదుల వీరన్న, జార ముత్తయ్య, జార సమ్మయ్య, ఇరప బుచ్చయ్య, ఇరప స్వామి, ఇరప నర్సయ్య, మల్లేశ్, శేఖర్, రాంబాబు, దేవరాజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు..


చుంచుపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: కొత్త రేషన్ కార్డుల జారీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయమేనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం చుంచుపల్లి మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన తెల్లరేషన్ కార్డులను అందించి, మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిత్యావసరాల పంపిణీ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, డీఎస్ఓ రుక్మిణి, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ సుభాషిణి, వాసిరెడ్డి మురళి పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్: అర్హులందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులను అందజేస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక రైతు వేదికలో సోమవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారులతో భేటీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎండీ ఎస్.బలరామ్, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రును వేర్వేరుగా కలిసి సింగరేణి సమస్యలపై చర్చించారు. ప్రధానంగా సింగరేణి సీఎస్సార్ నిధులతో శిథిలావస్థలో ఉన్న కొత్తగూడెం బస్టాండ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సాబీర్ పాషా, ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితం బుగ్గిపాలు


మాట్లాడుతున్న సీఐ టి.సురేశ్

ఇల్లెందు: మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గిపాలవుతాయని, యువత, విద్యార్థులు వాటికి బానిసలు కావొద్దని సీఐ టి.సురేశ్ సూచించారు. సోమవారం ఇల్లెందు సాహితీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.శేషకుమార్ మూడో వర్ధంతి సందర్భంగా ఇల్లెందులో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై ఈ పోటీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. కని, పెంచిన తల్లిదండ్రుల కళ్ల ముందే కొడుకులు కడతేరితే వారికి తీరని శోకం మిగులుతుందని, ఆ పరిస్థితి తీసుకురావొద్దని పేర్కొన్నారు. డ్రగ్స్ వాడినా రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సీఐ సురేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వెంకటస్వామి, తుమ్మలపల్లి ప్రసాద్, డాక్టర్ సుధాకర్, డి.రాంచందర్, అర్వపల్లి రాధాకృష్ణ, యాదగిరి రాంబాబు, మహేందర్, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

ఇల్లెందురూరల్: పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని కోరగుట్ట వద్ద వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ సభ్యుడు ఎలిమిశెట్టి వీరన్న, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సరిత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటి, సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతారని పేర్కొన్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటడం వల్ల అదనపు ప్రయోజనం ఉంటుందని చెప్పారు. అధ్యాపకులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న వాకర్స్‌క్లబ్ బాధ్యులు, లెక్చరర్లు

భయం.. భయంగా..


కాలేజీ వరండాలో కుంగిపోయిన ఫ్లోరింగ్


తరగతి గదిలో కుంగిపోయిన నాపరాళ్లు

- ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులు, అధ్యాపకుల అవస్థలు
- ప్రహరీ లేక పాముల సంచారం..

టేకులపల్లి: ఇటు సింగరేణి, అటు ప్రభుత్వ పట్టింపు లేకపోవడంతో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాలు దెబ్బతింటున్నాయి. దీంతో 25 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కాలేజీలో విద్యార్థులు, అధ్యాపకులు కుంగిన వరండాలు, తరగతి గదులు, పాములతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి, ద్వితీయ సంవత్సరంలో కలిపి మొత్తం 250 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తరగతి గదులు, వరండాలు, ప్రిన్సిపాల్, అధ్యాపకుల గదుల్లో ఫ్లోర్ కుంగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. నూతన భవనంలో ఈ పరిస్థితి ఉంటే.. పాత భవనం గ్రౌండ్ ఫ్లోర్ పరిస్థితి మరీ దారుణంగా మారింది. కుంగిపోయి నెర్రెలుబారి పాములు నివాసం ఏర్పర్చుకున్నాయి. రోజూ బిక్కుబిక్కుమంటూ ల్యాబ్ నిర్వహణ, తరగతుల నిర్వహణ నిర్వహించాల్సి వస్తోంది. ఏ క్షణంలో ఏ మూల నుంచి పాములు వస్తాయో తెలియక అనుక్షణం భయం గుప్పిట్లో విద్యార్థులు, అధ్యాపకులు కొట్టుమిట్టాడుతున్నారు. దీనికి తోడు తరగతి గదుల్లో ఫ్యాన్లు లేవు. కరెంటు వైరింగ్ అస్తవ్యస్తంగా ఉంది. పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రహరీ లేకపోవడంతో దొంగలు, మందుబాబులు సునాయసంగా కాలేజీలోకి వెళ్లి వస్తున్నారు. అయితే కాలేజీల అభివృద్ధికి ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. మొక్కుబడిగా, తాత్కాలికంగా కాకుండా త్వరితగతిన నిధులు విడుదల చేసి శిథిలమైన భవనాల్లో మరమ్మతులు చేయించాలని, ప్రహరీ నిర్మించాలని, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.